క్లుప్తంగా

పోలింగ్ శాతం పెంచాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న డీటీ

వీర్నపల్లి: మండలంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బూత్‌స్థాయి అధికారులతో సమావేశమై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి ఓటర్ సమాచార స్లిప్స్‌తో పాటు సీ-విజిల్ పాంప్లెట్ పంపిణీ చేయాలని బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రవీణ్, సిబ్బంది, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



కవాతు నిర్వహిస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు

తంగళ్లపల్లి: ఎన్నికల సజావుగా జరిగేందుకు వీలుగా పటిష్టమైన భద్రతతోపాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతారం, పెద్దలింగాపూర్, దాచారం, సిరిసకొండ, అనంతగిరి గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని ప్రతి పౌరుడు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు అండగా పోలీస్ శాఖ ఉందని ప్రత్యేక బలగాలతో ఎళ్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఇతరుల ఎన్నికల ప్రచారాలను అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాలో అనుచిత వాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని మజీద్ చౌక్, వివేకానంద చౌక్‌లో వహనాల తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు మధు, లక్ష్మీనారాయణ, బాపు, చందర్, క్రాంతి, ప్రత్యేక కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి



మాట్లాడుతున్న వద్ధూరి శ్రీనివాస్

వేములవాడఅర్బన్: పుస్తక పఠనంతోనే మానవ మేధాశక్తి వికాసం చెందుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వద్ధూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పుస్తక ప్రదర్శనను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మనసుకి వ్యాయామం లాంటి పుస్తక పఠనంతో పరిపూర్ణ వ్యక్తిత్వం పెంపొందుతుందన్నారు. ఆధునిక కాలంలో యువత సెల్‌ఫోన్, ఇంటర్నెట్, టీవీ, సినిమా వంటి మాధ్యమాలకు ఆకర్షితులై పెడదోవపడుతున్నారన్నారు. కళాశాల గ్రంథాలయాధికారి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, పుస్తక సమీక్ష, కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదకరంగా మూలమలుపులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి వద్ద అతి ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు దగ్గర నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. ఈ క్రమంలో మూలమలుపు దగ్గర ప్రమాదాలు జరిగి గతంలో ఎంతోమంది మృతి చెందడం, గాయాలపాలయ్యారు. అయినా మూలమలుపు వద్ద కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరుకైన వంతెనపై ప్రయాణం ఇబ్బందే..

ముస్తాబాద్: ముస్తాబాద్ నుంచి పోతుగల్, సిరిసిల్ల వెళ్లే రహదారిలో మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై చిన్న ఇరుకు వంతెన ప్రమాదకరంగా ఉంది. అక్కడి నుంచి పోతుగల్ వరకు నిర్మించిన డబుల్ రోడ్డు ఉంది. అయితే ముస్తాబాద్ ప్రారంభంలో మానేరు కెనాల్‌పై ఇరుకు వంతెనతో భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులను ఆర్‌అండ్‌బీ అధికారులు పెట్టలేదు. పోతుగల్ నుంచి నేరుగా కెనాల్‌లోకి వాహనాలు దూసుకెళ్లే ప్రమాదముంది. అలాగే కెనాల్ రహదారిపై నుంచి వచ్చే వాహనాలు వంతెన వద్ద కలిసే అవకాశం ఉంది. అధికారులు స్పందించి, కెనాల్‌పై వంతెనను విస్తరించాలి.

పత్తాలేని కల్లాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దేవరాజు గ్రామం దుమాల. ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సౌకర్యం లేక రోడ్డుపైనే ధాన్యం ఆరబోస్తున్నాడు. ప్రమాదకరమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో రోడ్డుపై ఆరబోస్తున్నట్లు తెలిపాడు. కొన్ని సందర్భాల్లో రోడ్డుపై వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఇది ఒక దేవరాజు పరిస్థితే కాదు. మండలంలో అనేక ప్రాంతాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్డునే ఆశ్రయిస్తున్నారు.

- రహదారులపై ధాన్యపు రాశులు
- 25 కేంద్రాలకు స్థలాలు
- ప్రమాదపుటంచున అన్నదాతలు
- మండలంలో 35 కొనుగోలు కేంద్రాలు
- రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వెంకటాపూర్‌లో ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఎక్కడ చూసిన ఆరబోసిన ధాన్యంతో నిండి ఉంది. చీకట్లో వాటిని గమనించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాకు చెందిన భూక్య రమేశ్ అనే వ్యక్తి ఇలాగే ప్రమాదానికి గురై రెండు కాళ్లను కోల్పోయాడు. అలాగే ధాన్యానికి కాపలాగా ఉన్న రైతు మల్లయ్య కూడా వాహనం ఢీకొట్టడంతో కోమాలోకి వెళ్లాడు. ఇలా రోడ్లపై ధాన్యపు రాశుల వల్ల అటు రైతులు ఇటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

మండల వ్యాప్తంగా 35 కొనుగోలు కేంద్రాలు ఉండగా, కేవలం 10 కేంద్రాలకు మాత్రమే అనువైన స్థలం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక ఈ పరిస్థితి ఏర్పడింది. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలుగా రైతు కల్లాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. మండలంలో ఒకటి, ఆర తప్ప ఇప్పటి వరకు కల్లాల ఏర్పాటు కాలేదు. దీనిపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. రైతులకు కల్లాలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం సహకరిస్తే ఈ పరిస్థితి రాకపోయేది అని అంటున్నారు.

కాగితాలకే పరిమితం

ప్రత్యేక కల్లాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. 24 గ్రామపంచాయతీల పరిధిలో కేవలం పది చోట్ల కల్లాలు ఏర్పాటు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఒకవైపు రైతులకు సరైన స్థలాలను ఏర్పాటు చేయకపోవడం మరోవైపు ధాన్యాన్ని తూకం వేయడంలో జాప్యం చేస్తుండడంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తంటాలు పడుతున్నారు. రోజుల తరబడి రహదారులపైనే రాత్రింబవళ్లు ధాన్యం ఆరబెట్టుకొని, అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

వెంటాడుతున్న ప్రమాదాలు

ప్రధానంగా సిరిసిల్ల-కామారెడ్డి, ఎల్లారెడ్డిపేట-వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట-గంభీరావుపేట, ముస్తాబాద్-గంభీరావుపేట, ముస్తాబాద్-తంగళ్లపల్లి, సిరిసిల్ల-కోనరావుపేట, వేములవాడ-చందుర్తి, రుద్రంగి-మానాల, సిరిసిల్ల-జిల్లెల్ల ప్రధాన రహదారుల్లో రైతులు నిత్యం ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. గత రెండు సీజన్‌లలో నాలుగు ప్రమాదాలు జరిగి 8మంది రైతులు తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డారు. గోరింట్యాల, వీర్నపల్లి, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, వేములవాడ, తంగళ్లపల్లి శివారులు ప్రమాదాలు జరిగాయి. రాత్రివేళ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కనిపించక, వాటి చుట్టూ పేర్చిన బండరాళ్ల వల్ల అదుపుతప్పి, వాటి పక్కనే ధాన్యపు రాసులకు కాపల ఉన్న రైతులపైకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదానికి గురవుతున్నారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక స్థలాలను కొనుగోలు, లీజ్‌కు తీసుకొని ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యం కల్పించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డుపైనే ఆరబెడుతున్నం



కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కల్పిస్తారనే ఆశతో దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటున్నాం. నెల రోజులుగా రోడ్డుపైన ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– అజ్మీరా శంకర్, రైతు, అల్మాస్‌పూర్

ప్రభుత్వ స్థలాలు కరువు



కొనుగోలు కేంద్రాలకు అనుకూలంగా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. స్థలాల గుర్తింపులో అందువల్లే జాప్యం జరుగుతోంది. ప్రైవేట్ స్థలాలను లీజుకు తీసుకోని కేంద్రాలను ఏర్పాటు చేశాం. వచ్చే సీజన్ వరకు స్థలాల గుర్తింపు కోసం కృషి చేస్తాం.

– మల్లేశం, ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

సిరిసిల్లలో చాపర్ ఎక్కిన రేవంత్‌రెడ్డి

- కామారెడ్డి నుంచి వచ్చి వెళ్లిన టీపీసీసీ అధ్యక్షుడు



రేవంత్‌రెడ్డితో కేకే మంతనాలు

సిరిసిల్లటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం కామారెడ్డి నుంచి సిరిసిల్లకు రోడ్డుమార్గంలో వచ్చి హెలికాప్టర్‌లో బోథ్ నియోజకవర్గంలో జరిగే సభకు వెళ్లారు. కామారెడ్డిలో సీఎం పర్యటనతో హెలీకాప్టర్ ల్యాండింగ్ పర్మిషన్ రాక సిరిసిల్లలో ఇచ్చినట్లు సమాచారం. కామారెడ్డి నుంచి నేరుగా అయన రోడ్డుమార్గంలో వచ్చి సిరిసిల్ల కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు వచ్చారు. ఆయన రాక తెలుసుకున్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని స్వాగతం పలికారు. కాబోయే సీఎం అంటూ నినాదాలు చేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్ తదితరులు శాలువాలు కప్పారు. కాంగ్రెస్ సిరిసిల్ల అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి రేవంత్‌రెడ్డితో నేరుగా హెలీప్యాడ్ వద్ద మంతనాలు జరిపారు. కాంగ్రెస్ నేతలు సంగీతం శ్రీనివాస్, వైద్య శివప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్ షో కోసం.. ట్రాఫిక్‌ను నిలిపివేశారు

- విద్యానగర్‌లో వాహనదారుల కష్టాలు
- గంటసేపు రాకపోకలు బంద్



సిరిసిల్ల కొండా లక్ష్మణ్ బాపూజీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ జామ్

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ రోడ్ షో ఉండడంతో సిరిసిల్ల విద్యానగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పోలీసులు బుధవారం రాత్రి ట్రాఫిక్‌ను నిలిపివేశారు. మంత్రి కేటీఆర్ ప్రసంగం ముగిసే వరకు గంట సేపు వాహనాలను రోడ్డుపై నిలిపివేయడంతో వాహనదారులు అసహనానికి గురయ్యారు. ట్రాఫిక్‌తో కొండా లక్ష్మణ్ బాపూజీ సర్కిల్ నిండిపోయింది. వేములవాడ, సిరిసిల్ల పట్టణాల వైపు వాహనాలు బారులు తీరాయి.



మార్కెట్ యార్డులో పార్కింగ్

వేములవాడరూరల్: ఇది పార్కింగ్ కోసం నిర్మించిన షెడ్డు అనుకుంటున్నారా.. మీరు పొరబడినట్లే.. ఇది జిల్లాలోనే పేరుకెక్కిన పెద్ద వేములవాడ మార్కెట్ యార్డులో షెడ్డు. ప్రస్తుతం వ్యాపారాలు లేక వెలవెలబోతున్న ఈ షెడ్డును వాహనదారులు చక్కగా పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలోనే పేరుకెక్కిన పెద్ద మార్కెట్ యార్డుగా సంవత్సరానికి రూ.కోట్ల ఆదాయం ఉన్న ఈ మార్కెట్ ప్రస్తుతం కొనుగోలు, విక్రయాలు లేక వెలవెలబోతోంది. యార్డులో 10 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండగా వారికి ఎలాంటి పనిలేక దోమల బెడదకు కిటికీలకు జాలీలు కట్టుకుంటున్నారు.

మానకొండూరులో ఓట్లు వేయాలని సిరిసిల్ల ఓటర్లకు ఫోన్ కాల్స్

- విసిగెత్తిపోతున్న సిరిసిల్ల ఓటర్లు

తంగళ్లపల్లి: మానకొండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో పది అడుగులు ముందుకు వేస్తున్నారు. తమ నియోజకవర్గ పరిధిని వదిలి మరీ ప్రచారం చేస్తున్నారు. మానకొండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నిలబడిన పలాన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని సిరిసిల్ల నియోజకవర్గ ఓటర్లకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ప్రతిరోజు కాల్స్ వస్తుండడంతో సిరిసిల్ల నియోజకవర్గ ఓటర్లు విసుక్కుంటున్నారు. 'మా నంబర్లు మీకెవరు ఇచ్చారయ్యా? కనీసం ఎవరికి ఫోన్ కాల్స్ వెళుతున్నాయో కూడా చెక్ చేయారా? అంటూ మండిపడుతున్నారు. చాలామంది ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులు పెట్టేశారు.

స్వయంపరిపాలన దినోత్సవం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు టీచర్‌గా మారి తోటి చిన్నారులకు ఒక్కరోజు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మధుర, ప్రధానోపాధ్యాయులు దేవదాస్, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి ప్రకటించారు. 17 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఈ సమావేశానికి ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి మాత్రమే హాజరుకావడంతో మిగతా సభ్యులు హాజరుకాకపోవడం వల్ల కోరం లేనందున ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వినికిడి పరికరాలు వితరణ

సిరిసిల్లటౌన్: తెలంగాణ సీనియర్స్ సిటిజన్స్ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించిన ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరంలో వైద్యులు సేవలను అందించారు. అనంతరం వినికిడి సమస్య ఉన్నవారికి ఉచితంగా వినికిడి పరికరాలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, దొంత దేవదాసు, డాక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన పుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బండి ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, గాజంగి కీర్తి, గట్టు శ్రీకాంత్, మంచికట్ల గంగభవాని, పట్టెం పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బషీర్

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ముస్తాబాద్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా కొండాపూర్ ఉపసర్పంచ్ మహ్మద్ బషీర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్ సాహెబ్ బుధవారం నియామక పత్రాలను అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ అభినందించారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నూతన పాలక వర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గడ్డం జితేందర్, ఉపాధ్యక్షుడిగా గంట వెంకటేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్లు సర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఒక దళితుడిని ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం అందుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సర్పంచ్ వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సర్పంచ్ సన్మానించారు. అయితే సర్పంచ్ ఏకపక్షంగా పాత పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా కమిటీని ఎన్నుకున్నారని, ఆలయ ఆవరణలో ఎన్నుకోవాల్సిన కమిటీని గ్రామ పంచాయతీలో ఎన్నుకోవడం సరైంది కాదని మాజీ చైర్మన్ నంది కిషన్ ఆరోపించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ధ్వజారోహణం



వేడుకలకు ముస్తాబైన అయ్యప్పస్వామి ఆలయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈనెల 16న గురువారం నుంచి డిసెంబర్ 26 వరకు ఆలయంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామికి మండల పూజ కార్యక్రమాలు ఉంటాయని గురుస్వామి శ్రీనివాస్ తెలిపారు. మండల పూజకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత, గణపతి హోమం, గణపతి, సుబ్రహ్మణ్య పూజ, ఆదిత్యాది నవగ్రహ పూజ, అయ్యప్ప స్వామికి అష్టాభిషేకం, పుష్పార్చన, ధ్వజారోహణం, మంగళహారతి, మంత్రపుష్పం, మహానివేదన కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈ కార్యక్రమలకు భక్తులు, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ

తంగళ్లపల్లి: సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోయిన, దొంగలించబడ్డ సెల్‌ఫోన్లను రికవరీ చేయడం సులభమని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ అన్నారు. బుధవారం సెల్ ఫోన్ పోగొట్టుకున్న వంతడుపుల గ్రామానికి చెందిన గవ్వల శ్రీనివాస్, వల్లంపట్ల పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్ ఫోన్లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి వారికి అందజేశారు. సెల్‌ఫోన్ పోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఫోన్లను ట్రేస్ చేయడంలో ప్రతిభచూపిన పోలీస్ సిబ్బంది అనిల్, మధు, లక్ష్మీనారాయణను ఎస్సై అభినందించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పన్నెండేళ్ల పాటువిద్యా బోధన చేసిన ఐదుగురు ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. కృష్ణహరి, రాచర్ల వెంకన్న, ఇంద్రారెడ్డి, జయశ్రీ, శ్రీనివాస్‌ను ప్రధానోపాధ్యాయులు దబ్బెడ హన్మండ్లు ఆధ్వర్యంలో సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కారణమైన వారిని విద్యార్థులు ఎప్పుడు గుర్తుంచుకుంటారన్నారు.